క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన కైలాస్ నేత


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కైలాస్ నేత

మునుగోడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 వేల పోస్టులు భర్తీచేయడంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, మిగిలిన ఖాళీలను కూడా భర్తీ చేయాలని కోరినట్లు చెప్పారు. పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్న నాయకులకు కార్పొరేషన్ పదవుల్లో తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరినట్లు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లా పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం నల్లగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ బీసీ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా, డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రెసిడెంట్‌గా బి.నరేందర్‌రావు, జిల్లా సెక్రటరీగా నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పి.వసంత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.సీతారామరావు, సీహెచ్.వెంకట్‌రెడ్డి, ఎన్.సుధాకర్, డి.కమల, ప్రశాంతి లేడీ రిప్రజెంటేటీవ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తాజుద్దీన్ బాబా, మనోరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మర్రిగూడ : పేద ప్రజలకు రేషన్ పంపిణీ సరిగా నిర్వహించకపోతే డీలర్లు రాజీనామా చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర విజిలెన్స్ బృందంతో కలిసి మర్రిగూడ మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కొందరు రేషన్ డీలర్లు రేషన్ ఇవ్వడానికి బదులుగా డబ్బులు ఇచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు యాదయ్య, అంజయ్య పాల్గొన్నారు.

విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న యాదయ్య

కనగల్: తొరగల్ గ్రామ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్వహణ ఖర్చుల కింద స్వీపర్ మారబోయిన అమృతకు శుక్రవారం మాజీ సర్పంచ్ చిర్రబోయిన యాదయ్యయాదవ్ రూ.12 వేలు విరాళం అందజేశారు. కాగా 2013లో ఈ గుడి నిర్మాణం కోసం ఆయన రెండు గుంటల స్థలాన్ని దానంగా ఇచ్చారు.

టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

కనగల్: మండల కేంద్రంలోని అక్కేనపల్లి వెంకటేశ్వరరావు మెమోరియల్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ను శుక్రవారం ఎంఈఓ వి.పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధామసయ్య, ల్యాబ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

మునుగోడు: ప్రమాదాలకు గురైన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం అందించాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలు చెల్లించాలని తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మాదగోని నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మునుగోడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 710 మంది కల్లుగీత కార్మికులకు రూ.12 కోట్ల 60 లక్షల ఎక్స్‌గ్రేషియా అందాల్సి ఉందన్నారు.

బతుకమ్మ పండుగ తేదీలు ఖరారు

నకిరేకల్ : ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగ ఈ నెల 21న జరుపుకోవాలని శ్రీ గాయిత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ నకిరేకల్ నియోజకవర్గ కమిటీ నిర్ణయించింది. కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశ్వరశర్మ అధ్యక్షతన నకిరేకల్ పట్టణంలోని సాయి మందిరంలో గాయిత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంగిలి పువ్వు, సద్దుల బతుకమ్మ, దసరా పండుగ తేదీలను నిర్ణయించారు. 22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం, 29న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న విజయదశమి (దసరా పండుగ) జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పగిడిమర్రి మధుసూదన్ శర్మ, దుర్గి మురళీధర్ శర్మ, వావిలాల రామలింగేశ్వర శర్మ, కాటేపల్లి శ్రీనివాస్‌శర్మ, నారాయణ చంద్రమౌళిశర్మ, ఈదులవాడ ఆనంద్, నిడిగొండ గౌతమ్, పగిడిమర్రి నవీన్, నందిబట్ల భరద్వాజ్, సోమశేఖర్‌శర్మ, ఫణి శర్మ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన సుందరీకరణ పనులు

- రోడ్డు విస్తరణ, డ్రైయినేజీ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.9 కోట్లు మంజూరు
- మధ్యలోనే పనులు ఆపిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తిప్పర్తి సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె


కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

తిప్పర్తి : ఆర్అండ్‌బీ నిధులు రూ.9 కోట్లతో తిప్పర్తి మండల కేంద్రంలో చేపట్టిన సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ పనులను గతేడాది ఆగస్టులో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి నుంచి ఆ పనులు నత్తనడకన సాగాయి. గత మూడు నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ సుందరీకరణ పనులను పూర్తిగా నిలిపివేశారు.

ఒక లేయర్ బీటీ రోడ్డు మాత్రమే..

సుందరీకరణలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, విద్యుత్ స్తంభాల తొలగింపు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మూడు కల్వర్టులకు గాను, ఒకే కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా రెండు కల్వర్టుల పనులు ప్రారంభించలేదు. మండల కేంద్రంలో సీసీ రోడ్డు మాత్రమే వేశారు. ఒక లేయర్ బీటీ రోడ్డు వేశారు. నకిరేకల్ రోడ్డు పనులు ఇంకా ప్రారంభించలేదు. సెంట్రల్ డివైడర్ మాత్రం ఏర్పాటు చేశారు.

వర్షం వస్తే మురుగు ఇళ్లల్లోకి..

సుందరీకరణ పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టలేదు. దీంతో మురుగు కాల్వలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే మురుగునీరు ఇళ్లలోకి చేరుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కూడా మురుగు కాల్వలను శుభ్రం చేయించడం లేదు. విద్యుత్ స్తంభాలను తొలగించడం లేదు. కల్వర్టుల నిర్మాణం పూర్తికాకపోవడంతో మిర్యాలగూడ రోడ్డులో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మండల కేంద్రం ప్రజలు కోరుతున్నారు.

ఏడాది అవుతున్నా పూర్తి కాలేదు



తిప్పర్తి మండల కేంద్రంలో సుందరీకరణ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నప్పటికీ ఇంకా పూర్తి చేయలేదు. రోడ్డు విస్తరణ సక్రంగా చేపట్టలేదు. డ్రెయినేజీ ప్రారంభం కాలేదు. దీంతో ఇంటి ముందు డ్రెయినేజీ నిండి వాసన వస్తోంది. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు కూడా డ్రెయినేజీల్లో పూడిక తీయించడం లేదు. త్వరగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలి.

– కొండూరు శ్రీనివాస్, తిప్పర్తి

త్వరలో పనులు పూర్తి చేస్తాం

సుందరీకణ పనులు సగం వరకు పూర్తి చేశాం. మిలిగిన పనులు వర్షాల కారణంగా ఆలస్యం అవుతున్నాయి. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– గౌస్, ఏఈ ఆర్అండ్‌బీ, తిప్పర్తి

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తూర్పాటి కోటేష్, తూర్పాటి శ్రీశైలం, చందు, తీగల అశ్వినిశంకర్, రమేష్, గాదిర బయ్యన్న, గాదరి సుదర్శన్, సుధాకర్, వెంకటరమణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఎస్‌కే.లతీఫ్, ఆర్.యాదగిరి, ఎ.జగన్నాథం, గాజుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక కేంద్రం ప్రారంభం

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేదిక కేంద్రాన్ని శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకులు యంగలి గోపి సౌమ్య, ఐసీఎం కంపెనీ ప్రతినిధి ఎంగలి లక్ష్మీనారాయణ, లతీఫ్, రాచకొండ యాదగిరి, అంజయ్య, రాచకొండ గోపి తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

నల్లగొండ టూటౌన్: జై భారత్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని టూటౌన్ సీఐ రాఘవరావు తెలిపారు. జై భారత్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన నల్లగొండ పట్టణంలో ప్రారంభించి మాట్లాడారు. ట్రస్టును స్థాపించిన గోలి ప్రభాకర్‌ను ప్రశంసించారు. నిరుపేద దివ్యాంగులకు, తల్లీ తండ్రి లేని అనాథ పిల్లలకు విద్య, వైద్య సాయం అందజేయడం, నిరుద్యోగ యువతకు టెక్నికల్ కోర్సులు ఇప్పించి వారికి ఉపాధి కల్పించడం, వృద్ధులకు సాయం చేయడం లాంటివి చేస్తున్న ట్రస్టు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి రవి కుమార్, క్రాంతికుమార్, చెడుపాక గంగరాజు, పోచం కన్నయ్య, మేకల కృష్ణయ్య, ఎస్ వెంకటరాములు, ఎం.నవనీత, కె.సుధీర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఉమేష్

నార్కట్‌పల్లి: మండలంలోని జువ్విగూడెం గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని శుక్రవారం ఎంపీడీఓ కె.ఉమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి మండలంలో 532 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. 439 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారని, 127 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తయ్యాయని పేర్కొన్నారు. బేస్మెంట్ లెవెల్ వరకు పూర్తి చేసిన 73 మందికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేసిందన్నారు. రూఫ్ లెవెల్ వరకు పూర్తయిన ఇద్దరు లబ్ధిదారులకు మరో రూ.లక్ష బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఉచిత ఇసుకకు ఎంపీడీఓ కార్యాలయంలో, సంబంధిత గ్రామ సెక్రటరీ, హౌసింగ్ ఏఈని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డి.ఇందు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

నల్లగొండ టౌన్: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పెండింగులో ఉన్న దాదాపు ఎనిమిది వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, శ్రీకాంత్, చరణ్, రవి, మహేష్ పాల్గొన్నారు.

లచ్చిరాంకు పురస్కారం



మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం శుక్రవారం పారాచూట్ వరల్ రికార్డ్ నుంచి పర్యావరణ సారథి పురస్కారం-2025 అందుకున్నారు. పారాచూట్ వరల్డ్ రికార్డ్ ఇండియా చీఫ్ దాసరి స్వప్న మహేష్ ఆన్‌లైన్‌లో ఉదావత్ లచ్చిరాంకు అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించడం, పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడంలో కృషి చేసినందుకు ఈ అవార్డుకు లచ్చిరాంను ఎంపిక చేశారు.

ఉత్తమ అధ్యాపకులు, విద్యార్థులకు ప్రోత్సాహకం


ప్రోత్సాహకం అందుకుంటున్న విద్యార్థి

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు, విద్యార్థులకు శుక్రవారం జీఎస్ రావు ఫౌండేషన్ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులు తేజస్విని, సంతోషిరాణి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు అబ్బగోని రాకేష్, ఆవుల శివ, సిగ బన్నీ, గోగిక దుర్గ భవానిలకు ఫౌండేషన్ చైర్మన్ మొహమ్మద్ ఇస్మాయిల్, కవిత సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, లక్ష్మయ్య, రవీందర్ నాయక్, వెంకటేశ్వర్లు, అంజి బాబు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ నరసింహ

నార్కట్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణవెల్లంలలో ఎస్‌జీఎఫ్ క్రీడలను శుక్రవారం ఎంఈఓ నర్సింహ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దేశబోయిన నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శంభులింగం, ఇమామ్ కరీం, శ్రీనివాస్, రామస్వామి పాల్గొన్నార

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

నల్లగొండ టౌన్: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. నల్లగొండలో శుక్రవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా నల్లగొండ పట్టణంలో జరుగనున్న భారీ బహిరంగ సభలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేవరపల్లి వెంకటరెడ్డి, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, అద్దంకి నరసింహ, సైదాచారి, నాగరాజు, శ్రీవాణి పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్దగల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని ఎండోమెంట్ అధికారుల సమక్షంలో శుక్రవారం లెక్కించారు. రెండు నెలలకు సంబంధించి రూ.10,62,964 ఆదాయం సమకూరిందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది చనగాని నగేష్ గౌడ్, ఎం.రాజు, కే.నరేష్, ఎం.రమేష్, ఆర్.వెంకన్న, కే.ప్రభాకర్, శంకర్‌రెడ్డి, దుర్గమ్మ, జె.చంద్రయ్య, జి.నాగేశ్వరరావు, కే ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, జె,నాగరాజు, రవి పాల్గొన్నారు. .

ఎంఈఓకు వినతి

మునుగోడు: పరిమితికి మించి విద్యార్థులను పాఠశాల బస్సుల్లో ఎక్కిస్తున్న సెయింట్ జోసఫ్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి శుక్రవారం ఎంఈఓ మల్లేషంకు వినతిపత్రం అందచేశారు. ఒక్కో బస్సులో 30 నుంచి 35 మంది విద్యార్థులను మాత్రమే తీసుకురావాల్సి ఉండగా 70 నుంచి 80 మందిని ఎక్కిస్తున్నారని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి నరేష్, యాసరాని వంశీకృష్ణ, యాట శ్రీకాంత్, శ్యామ్, మహేందర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం !


మామిడాల గ్రామపంచాయతీ కార్యాలయ భవనంపై ఏపుగా పెరుగుతున్న మర్రి చెట్టు

తిప్పర్తి : మండలంలోని మామిడాల గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికితోడు భవనం వెంట మర్రిచెట్టు ఏపుగా పెరిగింది. మొక్కగా ఉన్నప్పుడే తొలగించకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెట్టు గుబురుగా పెరుగుతోంది. చెట్టును ఇలాగే వదిలేస్తే మరికొద్ది రోజుల్లో భవనాన్ని కూల్చే ప్రమాదం ఉంది.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


నల్లగొండ టౌన్: సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చిట్యాల : పూలమాల వేస్తున్న నాయకులు


నాంపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: సీతారాం ఏచూరి స్ఫూర్తితో వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఏకం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో వారు పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, ఎండీ.సలీం, పి.నర్సిరెడ్డి, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, కొండ అనురాధ, తుమ్మల పద్మ, సైదులు, పరిపూర్ణచారి, మన్నెం భిక్షం. వెంకన్న, రవి, కుంభం కృష్ణారెడ్డి, పామనగుండ్ల అచ్చాలు, అశోక్, అంజయ్య, భూపాల్, మధుసూదన్‌రెడ్డి, మట్టయ్య, నరేష్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నల్లగొండలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ నాయకురాలు తుమ్మల పద్మ, గుండాల నరేష్ , రాము, సునిత, నరేందర్, పరిపూర్ణాచారి, ఇందిరా, ఎ.పద్మ, గోవిందమ్మ, రూప, నాగేంద్ర, శైలజ, అల్తాఫ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: సీపీఐ(ఎం) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం నార్కట్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, చెరుకు పెద్దులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి శంకర్, కొప్పు శ్రవణ్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, కట్ట రామచంద్రం, అర్థం శ్రీనివాసు, మిర్యాల రాములు, దండు శంకరయ్య, శంకర్, నాగరాజు, శ్రీను, గోపి, నరేష్, యాదయ్య, మాదగోని సైదులు, బొంగు లింగయ్య పాల్గొన్నారు.

నాంపల్లి: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం నాంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిపాక ముత్తిలింగం, కోమ్ము లక్ష్మయ్య, వట్టికోటి చంద్రమౌళి, ఇరిగి వెంకటయ్య, పెరుమాళ్ళ రాంబాబు, మహేష్, ప్రభాకర్, శేఖర్ పాల్గొన్నారు.

గట్టుప్పల్ : సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం గట్టుప్పల్ మండల కార్యదర్శివర్గ సభ్యుడు కర్నాటి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు టేకుమట్ల కృష్ణ, కర్నాటి వెంకటేశం,పెద్దగాని నరసింహ, ముసుకు బుచ్చిరెడ్డి, ఎండీ రబ్బాని, కర్నాటి యాదయ్య, పసుపుల చెన్నయ్య, బొబ్బల చంద్రయ్య, ఖమ్మం నరసింహ, మస్నం మల్లయ్య పాల్గొన్నారు.

చిట్యాల: సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతిని శుక్రవారం చిట్యాలలో సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి ఫ్లెక్సీకి ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, బొబ్బల సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, ఐతరాజు యాదయ్య, మాదరబోయిన వెంకన్న, అక్కెనపల్లి నాగయ్య, కోనేటి రాములు, పాలమాకుల అర్జున్, రుద్రారపు పార్వతమ్మ, బొడ్డు బాబురావు, గాదె ఎల్లేష్ పాల్గొన్నారు.

నకిరేకల్ : సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి గొప్ప నేత అని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన సీపీఎం శ్రేణులతో బైక్‌లపై ర్యాలీగా వెళ్లి నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న కల్లు రాంచంద్రారెడ్డి స్మారక స్తూపానికి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన వెంకులు, జిట్టా నగేష్, ఆయా మండలాల కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, పింజర్ల సైదులు, చలకాని మల్లయ్య, అవిశెట్టి శంకరయ్య, చింతపల్లి బయ్యన్న, రోడ్డు మారయ్య, వంటెపాక వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి జిట్టా సరోజ, మల్లమ్మ, మహేష్, గంజి మురళి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం సరే.. ప్రారంభం ఎప్పుడు!


ఇప్పలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవనం

కేతేపల్లి: మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. కొర్లపహాడ్ గ్రామపంచాయతీకి ఆవాస గ్రామంగా ఉన్న ఇప్పలగూడెం 2018లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇరుకైన అద్దె భవనంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యాలయ నూతన భవనానికి మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.20 లక్షల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో స్థానిక చెరువు ఒడ్డున భవనం నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయి దాదాపు రెండేళ్లు గడిచినా నేటివరకు ప్రారంభించకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం రెండు గదులు మాత్రమే ఉన్న రేకుల షెడ్డులో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇరుకైన అద్దె భవనంలో విధులు నిర్వహించేందుకు పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

మర్రిగూడ : స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను సందర్శించారు. రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయో వైద్యులను అడిగి తెలుసుకుని అవగాహన పెంచుకున్నారు. అదేవిధంగా మాల్‌లోని మీ మార్ట్ స్టోర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ ఉయ్యాల వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ ఇ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు పలు అంశాలపై అవగాహన పెంపొందించుకుంటారని అ న్నారు. సింగం వెంకటరమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు


మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్ : శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి వెళ్తున్న టీ పీసీసీ అధ్యక్షుడు బొమ్మగాని మహేష్‌కుమార్‌గౌడ్ నార్కట్‌పల్లి శివారులోని వివేరా హోటల్ వద్ద శుక్రవారం సాయంత్రం కొద్దిసేపు ఆగారు. ఆయనకు టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. నార్కట్‌పల్లి మండ ల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల ఉశయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్యయాదవ్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న చిరు వ్యాపారులు

నకిరేకల్ : పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో తోపుడు బండ్లను తొలగించవద్దని కోరుతూ శుక్రవారం నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ రంజిత్‌కుమార్‌కు చిరు వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. ఇదే స్థలంతో చిరు వ్యాపారాలు చేసుకునేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు పల్స శ్రీనివాస్‌గౌడ్, జిల్లా డాకయ్య, చిరు వ్యాపారులు మంగనపల్లి కిషన్, సైదులు, రాజు, అంజయ్య, రాములమ్మ, అనిత భాస్కర్, నాగేందర్, వెంకన్న, ముత్తయ్య, తదితరులు ఉన్నారు.

గిన్నిస్ బుక్‌లో గట్టుప్పల్ వాసికి చోటు

గట్టుప్పల్: మండల కేంద్రానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ కర్నాటి రామయ్య ఎల్ఐసీ పాలసీలు చేయించడంతో గిన్నిస్ బుక్‌లోలో చోటు సాధించాడు. ఆయన ఈ ఏడాది జనవరి నెలలో ఒకేరోజు 5,88,107 పాలసీలు తన టీంతో కలిసి చేయించడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కింది. రామయ్యకు హైదరాబాద్ వనస్థలిపురం బ్రాంచ్ మేనేజర్ రామచందర్ శుక్రవారం నల్లగొండలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందజేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన రామయ్యను గట్టుప్పల్ వాసులు ఘనంగా సన్మానించారు.


గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న కర్నాటి రామయ్య